

# తెలుగు కోపం



"తెలుగు వాడు ఎలాంటి వాడు?" అని ఎవరినైనా అడిగితే రక రకాల సమాధానాలు వస్తాయి. "తెలుగు వాడికి ఆరంభ శూరత్వం హెచ్చు" అని ఒకరంటే, "తెలుగువాడు భోజన ప్రియుడు" అని మరొకరంటారు. నన్ను అడిగితే "తెలుగువాడికి కోపం మీద మమకారం మెండు" అంటాను.

త్రిగుణాత్మక మయిన సగుణ బ్రహ్మములో రజో గుణము ఒకటి. ఈ రజస్సునే తెలుగులో 'కోపము' అంటాం. ఈ గుణము ప్రధానముగా వున్నవారిని 'కోపిష్టులు' అని అంటాం. కోపం ఎల్లప్పుడు అపకారమే చేస్తుందనుకోవడము, కోపిష్టులు అంతా చెడ్డవాళ్ళు అని అనుకోవడం రుజువు కానివే. పరశురాముడు, దుర్వాసుడు, విశ్వామిత్రుడు, మొదలయినవారు అంతా కోపిష్టులే; మనపురాణాలలో ఋషులు ఎప్పుడో ఒకప్పుడు కోపగించుకొని ఎవరినో ఒకరిని శపించ కుండా వదిలిపెట్టలేదు. కోపం చల్లారిన తర్వాత శాపానికి విరుగుడుగా విష్ణుమూర్తి భూలోకంలో జన్మించడమో, గంగాదేవి భువి నుండి దివికి రావడమో, జరుగుతుంది. అంటే ఏమన్నమాట? మహానుభావులకి కోపం వచ్చినా లోక కల్యాణమే జరుగుతుంది. చిక్కల్లా నాలాటి వాడికి కోపం వస్తేనే:

మహానుభావుల కోపాలు మనని ఎలా వుద్ధరించేయో సోదాహరణంగా మనవి చేసికొంటాను: పురాణ గ్రంథం, "రామాయణం" వాల్మీకి కోపకారణంగానే ఉద్భవించిందని కదా అంటారు ఒకనాడు కిరాతుడొకడు క్రౌంచమిధునం లోని ఒక పక్షిని సంహరించగా, ఆ ఘాతుకం చూసి, కోపోద్దీపితుడై, హృదయవరితప్తుడై, ఆ వ్యాధుని వాల్మీకి యిలా నిందించేరుట:

"మానిషాద ప్రతిష్ఠాంత్వ మగమశ్శాశ్వతే సమాః
యత్క్రౌంచ మిదునాం దేకమవధీం కామమోహితం"

ఆశ్రమంలో అడుగిడినా అనుక్షణం ఆశ్లోకమే స్ఫురణకువస్తే,దాని అర్థం మర్దించి మర్దించి చూడగా రామాయణార్థంశ్లేషగా స్ఫురిస్తే, శ్రీరామచంద్రుడు పుట్టక పూర్వమే వాల్మీకి రామాయణం వ్రాసాడన్నది పండిత వాక్యము. నిజానికి వాల్మీకికి వచ్చినది కోపంకాదు శోకం.

అనాది నుండి కవి శేఖరుల వర్ణనలో కోపం ప్రముఖ పాత్ర ధరించింది. కోపం వర్ణించేటప్పుడు పద్యం కదన రంగంలోకి పురికే గుర్రపు నడకలా వుంటుంది. కోపం వచ్చేసరికి ముఖ భంగిమ మారుతుంది. భ్రుకుటి ముడి పడుతుంది. శరీరము స్వేదావృత మవుతుంది. హరవిలాసంలో దుర్వాసుని కోపాన్ని శ్రీనాధుడు యిలా వర్ణిస్తాడు.

"వికట భ్రూకుటి ఫాలభాగుడును ప్రస్వేదాంబు పూర్ణాళిలాం
గకుడుం బాటల గండ మండలుఁడునై ...... ..."

దక్షయజ్ఞాన్ని వర్ణిస్తూ (భాగవతము, చతుర్థస్కంధం) బమ్మెర పోతనామాత్యుడు శ్రీనాథునితో ఏకీభవిస్తూ యిలా అంటాడు.

"వికట రోష భయంకర భ్రుకుటి దుర్ని
రీక్ష దుస్సహ తేజోమహిమ దనర్చి
ఘన వికీర్ణ జటాబంధ కలితుడగుచు
నఖిల సంహార కారణుండై నటించు

అధరము వడకుట, పళ్ళు పట పట కొరుకుట, చెక్కిళ్ళు ఎర్రబడుట, జటాజూటము వుయ్యలలూగుట మొదలయినవి కోపానికి బాహ్య చిహ్నాలు. ఇటువంటి కోపిష్టి చూడడానికి భయంకరంగా వుండాలి.కాని, క్రోధావృతమయిన ముఖానికి ఘర్మజలం క్రొంగొత్త అందాన్ని ఆపాదిస్తుందని పోతనామాత్యులు అంటారు. అంతేకాదు.మహాభారతయుద్ధంలో, అర్జునుడిపై భీష్మునిది పైచేయి అవుతుంది. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మకే

వే|| వేమూరి

భీష్మునిపై కోపం వస్తుంది. కృష్ణుడు ఎలా వున్నాడంటే—

"హయ రింఖాముఖ ధూళిధూసరపరిన్యస్తాల కోపేతమై
రయజాత శ్రమతోయ బిందుయుతమై రాజిల్లు నెమ్మోముతో

కోపము వచ్చినా చిరునవ్వుతో వుండగలడు గనకనే ఆయనని భగవానుడు అన్నాము.కోపానికివున్నబాహ్యలక్షణాలు యింకావున్నాయి కొందరు హూంకరిస్తారు. కొందరి పై కండువా జారిపోతుంది

"హుంకారంబొనరించి అప్రతిమ రౌద్రోద్రేక సంరంభవిశ్శంకా హుంకృతిరు...... ..." (హరవిలాసము)

"చక్రంబు చేబట్టి చనుదెంచు రయమున పైనున్న పచ్చని పటము జార" (భాగవతము)

ఆఖరిమాట. కోపపరివేష్టితులు కన్నులతోనే నిప్పులు గక్కుతారు.

"కనుగొని కోపవేగమున కన్నులనిప్పులు రాలనంగముల్"
(మహాభారతము, విరాటపర్వము).

కనుక కోపం వచ్చిన వాడి దగ్గర నుండి తప్పుకొనడం వుత్తమ మార్గం.

కోపకారణంగా వచ్చేకలతను తిరుపతి వేంకటకవులు తమ హర్షచరిత్రములో యిలా వర్ణిస్తారు: "ఇంద్రియ తురంగములను నిరంకుశముగా నడిపినచో వెడలు రజస్సు దివ్యమగు దృష్టిని పాడు చేయక మానదు.... నీరు నిప్పుల వలె సహజవిరుద్ధములగు ధర్మక్రోధంబులెన్నడు నొక చోట నుండవు....పరుల దోషములు వెదకు బుద్ధికి తనదోషములు కన్పడనియట్లు, అలుక వొడమిన మతియు తన రాగద్వేషంబులు కాన నేరదు. కోపమున్న వాడు కన్నులున్ననుగుడ్డివాడే;కోపదూషితమగుబుద్ధికికర్తవ్యాకర్తవ్యములు తోచవు. కోపము గలవానికి కనుబొమలు వంకర కాక మునుపే బుద్ధికి వంకర వచ్చును. రక్తిమ కందోయి నాకర్షింపక ముందే యింద్రియముల నాకర్షించును. ఒడలి నుండి చెమట జారక ముందే తపస్సు జారును. అధరము స్ఫురింపక ముందే అపకీర్తి స్ఫురించును".

భర్తృహరి కోపిని యిలా చిత్రిస్తాడు — కోపి వుప్పుస ముద్రము వంటి వాడు. అతని మనస్సు వుత్తాల తరంగ భీకరము. కరి, వజ్ర, సముద్ర విషయములలో బిసతంతు, శిరీషపుష్ప, మధుకణము లెంతపని జేయునో ఆగ్రహవేశుని యందు హితోపదేశము కూడా అంతే జేయును.

అహంకారాంధకార బంధురములో పడేకదా, వళ్ళు తెలియని కోపములో కౌశికుడు ఒక వణిక్ప్రముఖుని గృహిణిని దూషించేడు. తరువాత ఆ పతివ్రతా శిరోమణి పాతివ్రత్య మహిమకు అచ్చెరువంది, పశ్చాత్తాపముతో కుమిలి, పరమాత్మని ప్రసన్నుని జేయుటకు కులవృత్తులతో పనిలేదని గ్రహించి, వృత్తి రీత్యా కటిక వాడయిన ధర్మవ్యాధునివద్ద ధర్మోపదేశం పొందాడు.

సాటి సోదరుడని కూడా దయదల్చక, యుక్తా యుక్త విచక్షణ జ్ఞానం కోల్పోయి, సుగ్రీవునిపై పగపట్టిన వాలి తన జీవితాన్నే కోపానికి బలిచేసి కొన్నాడు; గుడ్డిలో మెల్ల, ఆ పోయిన ప్రాణాలేవో శ్రీరామ చంద్రుని చేతుల మీదుగా పోయాయి.

కోపములో కూడా రకాలు వున్నాయి. వీటిలో మొదటిది ముక్కోపం. ముక్కోపులు కోపం వస్తే ఆపుకోలేరు. ఎదుటి వారిపై "చర్రు, బుస్సు" లాడుతారు. కాని కొద్ది క్షణాలలోనే శాంతిస్తారు. రెండవ రకం కోపులు, దీర్ఘకోపులు. ప్రథమ కోపుల కోపం తాటాకు మంట లాంటి దయితే, దీర్ఘకోపుల కోపం వూకలో నిప్పు లాంటిది. దీర్ఘకోపులు పగపడతారు. సమయంచూసి కాటు వేస్తారు. దీర్ఘ కోపంచాలాచెడ్డది,ప్రమాదకరమయినది. ఆరోగ్యానికి కూడా మంచిదికాదు . ఇది జీవితాన్ని నరకం చేస్తుంది. పగ మానవుడిని పశువుని చేస్తుంది.

కోపిష్ఠులలో మరొక తెగ వుంది. వీరికి కోపము వస్తే, ఎదుటి వారిని అందముగా, సొగసుగా, అలంకార ప్రాయంగా తిడతారు. ఇది ఒక కళ; అందరికీ చేతకాదు. తెనాలి రామకృష్ణ కవి నరసరాజుని తిట్టిన ఘట్టం ఆంధ్రు లెవరూ మరువ లేరు.

"తెలియని వన్నె తప్పులని దిద్దితనాన
తెలుసు నటంచు.........
...... ..................
కృష్ణరాన్నరసా! విరసా!! తుసా! బుసా!!"

తిట్టినా అలా తిట్టాలి. ఎదుటి వాడిని తిట్టడానికి దమ్ములు చాలక పోతే కవులు "అన్యాప దేశము" అనే అలంకారాన్ని వుపయోగిస్తారు. ఇటువంటి అన్యాపదేశములు తెలుగు వాఙ్మయములో కొల్లలుగా కనిపిస్తాయి.

శ్లేషార్థం వచ్చేటట్లు కోపాన్ని ప్రదర్శించడం కూడా కళే అనాలి. అలంకార ప్రాయంగా అంటించడం తెలుగువాడి సొత్తే నని నిరూపించడానికి, కొద్దిగా గ్రామ్య స్థాయికి దిగి, ఒక కథ చెబుతాను. ఒక కవి వస్త్రాలు వుతుక్కునేందుకు ఒక చెరువు గట్టుకి వెళ్ళేడుట. అక్కడి ఆడంగులు యీ పండిత ప్రముఖుని రాకనే గమనించ కుండా, ఒయ్యారంగా కబుర్లు చెప్పుకుంటూ రాళ్ళమీద కూర్చున్నారు. ఎంత సేపు ఆగినా యీయన బట్టలు బాదుకుందికి రాయి దొరకలేదు. కవిగారికి కోపంతో వళ్ళు మండింది. అక్కడున్న ఒక ఒయ్యారిని వుద్దేశించి కవిగారు యిలా అన్నారుట.

"బండ ముండా! రాయి ఇవ్వవే
కుళ్ళుముండా! గుడ్డలుతుక్కుంటాను".

ఈ ఒయ్యారి కోపంవచ్చి మొగుడ్ని తీసుకొని వచ్చింది. మెలికలు తిరిగిన కండరాలు, అడ్డచారల లుంగీ, చంకలో దుడ్డుకర్ర, చెవిలో బీడీ....యీ ఆకారంతో యమకింకరుడిలా వున్న ఆ మొగుడ్ని చూసే సరికి, మన కవిగారికి చెమటలు పోసేసాయి. తార బాగుండ బట్టి క్షణంలో తేరుకుని, ఆ ఆసామికి యిలా సంజాయిషీ చెప్పు కున్నాట్ట.

"బండముండారాయి, ఇవ్వవే
కుళ్ళుముండాగుడ్డ, వుతుక్కుంటాను"

అని అన్నాను. యిందులో తప్పేమిటో చెప్పు అని నిలదీశాడు. గళ్ళలుంగీ ఆసామీ సమాధాన పడి, కవిగారికి క్షమార్పణ చెప్పుకొని, పెళ్ళానికి నాలుగు చివాట్లువేసి, కవిగారికి ఒక రాయిని ఇప్పించి పెద్ద మొనగాడిలా నిష్క్రమించేడుట.

మరొక రకం కోపంవుంది. దీనిని అలక అంటాము. కోపం అనే సరికి దుర్వాసుడు ఎలా జ్ఞాపకం వస్తాడో అలాగే అలక అనే సరికి సత్యభామ గుర్తుకి వస్తుంది. "నా/య్యన కోప గృహంబు చేరి యా సత్రాజిత్తనయ ముసుంగిడి...." (పారిజాతాపహరణం) యుండగా, పద్మనాభుడు పారిజాతాన్ని దివినుండి భువికి తీసుకొని వచ్చేడు. అంతఃపుర కాంతలు ముసుంగిడి పడుండుటకు వీలుగా ప్రత్యేకం కోప గృహాలు కట్టించిన సనాతన

వాస్తు శాస్త్రజ్ఞులు నిజంగా అభినందనీయులు. నేటి ఆధునిక గృహిణికి కోపం వస్తే "సింకు"లో గిన్నెలు వేసి బాదుతారు. లేకపోతే కూరలో కారం ఎక్కువ వేసేస్తారు.

కొందరు తమ కోపాన్ని అదుముకొని, నిర్మాణాత్మకమయిన బాటలలో తమ ఆవేశాన్ని మలచి దిద్దుతారు. కోపోద్దీపితుడయిన చాణక్యుడు, నందవంశాన్ని నాశనం చేస్తానని భీకర శపథం చేసి, మౌర్య చంద్రగుప్తుని గద్దె ఎక్కించేడు. ఈ చంద్ర గుప్తుని మనుమడే అశోక చక్రవర్తి. ఈయన స్థాపించిన శాంతి స్థూపంలోని చక్రమే మన భారత జాతీయ పతాకాన్ని అలంకరించింది.

ఇక ఆధునిక యుగంలో, "కోపమున్న వాడికి కూడేలేదు", "పేదవాడి కోపం పెదవికి చేటు" వంటి సామెతలు తెలుగుదేశంలో కొల్లలు. "తన కోపమె తన శత్రువు" అన్న సుమతీ శతకంలోని పద్యం రాని తెలుగు వాడుండడు. తనకోపము తనకి శత్రువౌతుందని ఆధునిక యుగంలో వైద్యులు కూడా ఏకీభవిస్తున్నారు. ఈ సమాజంలో నాగరికతతో పాటు కోపగుణం బాహ్యలక్షణాలు కూడా మారుతూ వచ్చాయి. ఊగడానికి జటా జూటములు, జారడానికి కంకువాలు లేవుగా ఈ రోజులలో; మంత్రానికి చింతకాయలు రాలడం కూడా మాని వేశాయి. అతిగా కోపం ప్రదర్శిస్తే కోర్టుకెక్కవలసిన ప్రమాదం కూడా వుంది. కనుక, యీ రోజుల్లో కోపాన్ని దిగ మింగుకుని రక్తపు పోటు తెచ్చుకొనడం కంటె మార్గాంతరం కనిపించడం లేదు.

ఇటువంటి భీకర క్రోధ జ్వాలలనుండి మానవుడు తప్పుకొనలేడా? క్షణమాత్రపు ఆగ్రహావేశాలకు లోబడి అపకీర్తిపాలు కావలసిందేనా? తాత్కాలిక మైన, ద్వేషాలు పెంచుకొని పశుత్వానికి దిగజారేవారికి యీ ప్రపంచంలో మందేలేదా? ఉంది. దీనినే మనవారు "మౌనేన కలహం నాస్తి" అన్నారు. కోపం వచ్చినప్పుడు ఎదుటివారిని అవమానించకుండా మనమా ప్రదేశం నుండి నిష్క్రమించడం సర్వవిధాల శ్రేయస్కరం. కనుకనే కవిబ్రహ్మ తిక్కన అంటారు—

పగయడగించు టెంతయు శుభంబది లెస్సయడంగునే పగం
పగ........

తెలుగు సినిమాల్లో కోపంమీద చాలా మంచి పాటలున్నాయి. వాటిల్లో "కోపమేల రాధా దయచూడ వేలనాపై-" అనేది, "అలిగితివా సఖీ, అలుక మానవా" చాలా బావుంటాయి. అలాగే "మూగ మనసులు"లో "ముక్కుమీద కోపం నీ ముఖానికే అందం" అనేపాట అమెరికా వచ్చినా అమ్మాయిలు మర్చిపోరు. మరోపాట "ప్రణయవతీ నాపై కోపమా -" యిది పాత రికార్డు. యిలా కోప గీతాల గురించి గుర్తుచేసుకున్నకొద్దీ ఎంతయినా వ్రాయచ్చు!

## అమెరికా అమ్మాయీ!

అచ్చ తెనుగు-నుడికారంలా,
అందమయిన - అమెరికా అమ్మాయీ!
కొండవాలు వాల్జెడలూ - శిఖరాన పూ పొదలూ; ఎదలో
గండు తుమ్మెద - రొదలు:
కన్నెపిల్ల నయగారం - కన్న తల్లి మమకారం
విడివడని - ముడివిడని
ఏడడుగుల - మూడు ముళ్ళ - ఆలు మగల - అనుబంధం.
శృంగారం - సరిహద్దులు, పీఠిన పడని - ముద్దులు.
వెలలేని - మొదటి రాత్రులు, విలువైన - వెన్నెల రాత్రులు.
పండుగలు - పేరంటాలు—
గాజుల గల గలలు - పట్టు చీరెల గర గరలు
పసుపు, పారాణి నిగ నిగలు -, భోగి మంటల భుగ భుగలు,
సంక్రాంతి ముగ్గులు - బంతిపూల గొబ్బెమ్మలు
పట్టు పావడాలు - పాల పొంగులు
హోలీ రంగులు - వంగిన వంపులు
బతకమ్మలు - బొడ్డెమ్మలు
పల్లె సీమలు - పసిడి మనసులు
పైరగాలి విసుర్లకు - పైటకొంగు రెపరెపలు
నాట్లల్లో కోతల్లో- పల్లీయుల "టానింగ్"లు
కాయకష్టం గట్టితనం - పల్లెపడుచు సొగసుతనం.
మామిడి చివుళ్ళ- మేతలతో
మత్తెక్కిన కోయిల - కవ్వింపులు - మేల్కొలుపులు
ఎన్నో - మరెన్నో - ఇంకా ఎన్నెన్నో
తెలుసుకోవాలని వుందా? -అయితే వెళ్ళు
తెలుగు పడుచు - పుట్టిన దేశం
నేను కలవరించే - నా తెలుగుదేశం
నీ తెల్లదనం - మించి స్వదేశం

మూర్తి.యస్.దామరాజు

చికాగో, IL

చ. తలఁచిన నిద్రరాదు, చలిదార్కొను మోసలఁ బేర నెవ్వనిం
బిలిచిన గుండె జల్లుమనుఁ, బేర్చు మనః పరితాప వేదనల్,
నిలిచిన చోట నిల్వ ధృతి నెక్కొన, దక్కట! రంగ
రంగ! తా
వలచిన యింతిఁబాయు పగవద్దు సుమీ! పగవాని కేనియున్.

—సారంగు తమ్మయ

'వైజయంతీ విలాసము' నుంచి.